క్లుప్తంగా

సేవా కార్యక్రమాలు విస్తరించాలి



మొక్క నాటుతున్న లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రసాద్

నరసన్నపేట: పర్యావరణ సమతుల్యం క్షీణించడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ దశలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్ వీబీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. నరసన్నపేటకు ఆదివారం వచ్చిన ఆయన స్థానిక లయన్స్ క్లబ్ బృందం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు, ప్రతినిధులు సదాశివుని కృష్ణ, ఊణ్ణ రంగనాథ్, బాలగంగాధర్, పకీర్ ,రమేష్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవరి సాగుపై అవగాహన



చేపేనపేటలో శ్రీవరిసాగు పద్ధతిలో నాట్లు వేస్తున్న మహిళలు

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లువాడ గ్రామాల్లో శ్రీవరి సాగు పద్ధతలపై ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సురేష్ , నక్క చిరంజీవి అవగాహన కల్పించారు. సాధారణ పద్ధతి కంటే శ్రీవరి సాగులో దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. సాధారణ పద్ధతిలో వరి పంటకు 30 కేజీలు విత్తనాలు అవసరమైతే, శ్రీవరి సాగులో కేవలం రెండు కేజీల విత్తనాలు మాత్రమే సరిపోతాయన్నారు. శ్రీవరి సాగులో పురుగు, తెగుళ్ల ఉద్ధృతి అంతగా ఉండదన్నారు. నీరు కూడా శ్రీవరి సాగుకు చాలా తక్కువ సరిపోతుందని, యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎకరాకు 40 నుండి 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందన్నారు.

వరుస పద్ధతిలో నాట్లు వేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట: వరి నాట్లు వరుస పద్ధతిలో వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ తోట రమణ సూచించారు. బద్రి గ్రామంలోని కత్తిరి మీనాక్షి పంట పొలంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతం పద్ధతిలో వరి నారును శుద్ధి చేసే పద్ధతిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. వరుస పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల జీవన ఎరువులు, కషాయాలు పిచికారీ చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. సాధారణ పద్ధతి కంటే వరుస క్రమంలో నాట్లు వేయడం వల్ల పిలకలు ఎక్కువగా వేసి అధిక దిగుబడి వస్తుందన్నారు. యూనిట్ ఇన్‌చార్జి మోహన్, ఐసీఆర్పీ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షించడానికి ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయకుమారి, సత్య సాయి సమితి ప్రతినిధులు డాక్టర్ పి.తాతయ్యలు, ఎం.రవీంద్రబాబు, జనార్దనరావు, అన్నెపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు .

విద్యారంగానికి

కూటమి గ్రహణం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యను నిర్వీర్యం చేసేలా కనిపిస్తుంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించే ట్యాబ్‌లకు టాటా చెప్పింది. టోఫెల్ శిక్షణ తరగతులు, పరీక్షలకు మంగళం పాడింది. మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతను తగ్గించుకుంటూ పోతోంది. పాఠశాలలు తెరిచిన రోజే అందజేయాల్సిన స్టూడెంట్ కిట్లు ఇప్పటికీ చాలామంది విద్యార్థులకు అందలేదు. టీచర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- పాఠశాలల అభివృద్ధి శూన్యం
- ఎండీఎంలో అమలలు నిర్లక్ష్యం



నరసన్నపేట: శిథిలావస్థలో ఉన్న రామకృష్ణాపురం పాఠశాల

నరసన్నపేట: మండలంలో 4,900 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత విద్యా సంవత్సరం కంటే 600 మంది తగ్గారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మూడు పోస్టులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నరసన్నపేటలో ప్రాథమిక పాఠశాల (న్యూ స్కూల్) విద్యార్థులు లేక మూతపడింది. ప్రాథమిక తరగతులకు చెందిన విద్యార్థులకు బూట్లు కొరత ఉంది. పలు పాఠశాలల్లో అమ్మాయిలకు యూనిఫారం పూర్తి స్థాయిలో అందలేదు.

- సారవకోట మండలంలోని రైవాడ, బైదిలాపురం, రామకృష్ణాపురం కురడింగి పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాండ్రాయి, పెద్దలంబ, జమచక్రం, అలుదు పాఠశాలల్లో ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. స్టూడెంట్ కిట్లు పూర్తి స్థాయిలో అందలేదు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల బకాయిలు ఉండటంతో నాణ్యతలో తేడాలు వస్తున్నట్లు విమర్శలున్నాయి.
- జలుమూరు మండలంలో ఆరు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- పోలాకి మండలంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 12 మంది మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తలను రాజకీయ కక్షలతో తొలగించారు.

నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు వివరాలు..	
మొత్తం పాఠశాలలు	345
విద్యార్థులు	17450
ఉపాధ్యాయులు	1,224

ఎండీఎంలో నాణ్యతాలోపం



ఆమదాలవలస: నెల్లిపర్తిలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత కొరవడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. పలువురు విద్యార్థులు తమ ఇంటి వద్ద నుంచి క్యారేజ్‌లు తీసుకువచ్చి తింటున్నారు. ఒక్కోరోజు నాణ్యత లేకుండా వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పలు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఇప్పటికీ అందలేదు.

ఆమదాలవలస నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు..	
మొత్తం పాఠశాలలు	284
విద్యార్థులు	19,588
ఉపాధ్యాయులు	820

ఉపాధ్యాయుల కొరత



లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేట మండలంలోని మురగడలోవ గిరిజన గ్రామ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. కొండల్లో ఉన్న మురగడలోవ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న జంబాడ గ్రామంలోని పాఠశాలకు ప్రతీరోజు నడిచి వచ్చి, వెళుతుంటారు.

- కొత్తూరు మండలంలోని అబలాసింగి గిరిజన గ్రామంలో ఐటీడీఏ 1999లో ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాలలో 26 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు రెగ్యులర్ టీచర్ నియమించకపోవటంతో సీఆర్టీ తరగతులు నిర్వహిస్తున్నారు.
- పెద్దరాజపురం గిరిజన గ్రామంలోని పాఠశాలలో 20 మంది విద్యార్థులున్నారు. వీరికి సీఆర్టీ పాఠాలు చెబుతున్నారు.
- పాతపట్నం మండలంలోని బగంతరలో ఏకోపాధ్యాయ పాఠశాల, శిషుజగన్నాథపురం శిథిల భవనంలోనే పాఠాలు బోధిస్తున్నారు.
- హిరమండలం మండలంలోని ధనుపురం ప్రాథమిక పాఠశాల, తంప జెడ్పీ ఉన్నత పాఠశాల, హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది.

పాతపట్నం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు వివరాలు..	
మొత్తం పాఠశాలలు:	387
విద్యార్థులు	30,581
ఉపాధ్యాయులు	1,235

చెరువును తలపిస్తున్న రోడ్డు



చూసేందుకు చెరువు మాదిరిగా కనిపిస్తున్న ఈ చిత్రం అలికాం- బత్తిలి ప్రధాన రహదారి అంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగకమానదు. సుమారు వారం రోజులుగా సరుబుజ్జిలి జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రహదారిలో భారీగా వర్షం నీరు నిల్వ చేరడం వల్ల రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

- సరుబుజ్జిలి

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



నరసన్నపేట పట్టణంలోని ఉమాసహిత సోమేశ్వరాలయం ప్రాంగణంలో ఉన్న చౌడేశ్వరిదేవి జయంతోత్సవాల సందర్భంగా ఆదివారం కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చౌడేశ్వరి దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న వితరణ చేపట్టారు. సాయంత్రం భక్త బృందం సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

- నరసన్నపేట

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



కోమర్తి స్కూల్ వద్ద మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

నరసన్నపేట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా సత్యసాయి గ్లోబల్ ఆర్గనైజేషన్ పిలుపుమేరకు కోటి మొక్కలు నటే కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట మండలంలో 198 మొక్కలను ఆదివారం సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు నాటారు. కోమర్తి, యారబాడు, ఉర్లాం, లుకలాం, నడగాం స్కూల్స్ ఆవరణలో మామిడి, సపోటా, తురాయి, వేప, కాగు తదితర రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, హరిత సొసైటీ కన్వీనర్ హరిబాబు, ప్రతినిధులు చంద్రమౌళి, రమణమూర్తి, అనాథ గుప్త, నరసింహమూర్తి, అమ్మాయమ్మ, చల్ల లక్ష్మీనారాయణ, ఎం.ఎల్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఆమదాలవలస: పెన్షనర్లకు మధ్యంతర భృతి 30 శాతాన్ని వెంటనే ప్రకటించాలని పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దన రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దాస్యం లక్ష్మణరావు అధ్యక్షతన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. 12వ పీఆర్సీ నియమించి సంవత్సర కాలం దాటిపోయిందని, ఇంతవరకు మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించకపోవడం దారుణమన్నారు. సంఘ కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, సంఘ నాయకులు ఎస్.చంద్రశేఖర రావు, ఆర్.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, బెండి సూర్యనారాయణ, పి.వి.ఎస్.మాస్టారు, పి.భానోజీరావు, బెండి నారాయణరావు, కె.సంజీవరావు, కె.వి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి వెండి వస్తువులు వితరణ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి విశాఖకు చెందిన ఎన్.శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యులు వెండి ఉద్ధరణి, పంచి పాత్రలను విరాళంగా సమర్పించారు. 405 గ్రాముల బరువు గల ఈ రెండు వస్తువులను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు.

104 యూనిట్ల రక్తదానం



స్నేహితుల దినోత్సవం సందర్భంగా భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొత్తూరు మండల కేంద్రంలో ఆదివారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 104 యూనిట్ల రక్త సేకరణ జరిగినట్లు ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ అగతముడి అప్పలనాయుడు, బామిడి రాజు తెలిపారు. రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. నేటి యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ప్రిన్సిపాల్ ఎద్దు గోపాలదాసు నాయుడు రక్తదాతలకు అభినందించారు.

- కొత్తూరు

స్నేహమేరా జీవితం..



పాతపట్నం మార్కెట్ యార్డులో వాకర్స్, క్రీడాకారులు స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. మిత్రులంతా ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కొంతసమయం సందడిగా గడిపారు.

- పాతపట్నం

శ్రమదానం



పాతపట్నం మండల కేంద్రంలోని మహేంద్రతనయ నదీ తీరంలో ఉన్న స్వర్గధామం ఆవరణలో పాతపట్నం కళింగ కోమట్లు, గ్రామస్తులు కలిసి ఆదివారం పిచ్చి మొక్కలను తొలగించారు. స్వర్గధామాన్ని శుభ్రం చేశారు. ఇటీవల కళింగ కోమట్ల సంఘం ఆధ్వర్యంలో స్వర్గధామంలో భవనం నిర్మాణం చేపట్టారు. ఈ ఈ భవనాన్ని గ్రామస్తులు కూడా ఉపయోగించుకోవాలని కోమట్ల సంఘం సభ్యులు తెలిపారు.

- పాతపట్నం

మోక్షమెప్పుడో..



పెద్దలంబ సమీపంలో శిథిలమైన రోడ్డు

సారవకోట: మండలంలోని పెద్దలంబ గ్రామం నుంచి పాతపట్నం మండలం తెంబూరు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారా అని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

మృతిని కుటుంబానికి సాయం



రూ.25వేల చెక్కును అందజేస్తున్న కృష్ణంనాయుడు, తదితరులు

ఆమదాలవలస: మండలంలోని అక్కివరం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ జి.విద్యాసాగర్ తిరుపతి జిల్లా వై.వి.పాలెం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆదివారం ఉదయం భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.తిరుపతి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి అభ్యర్థన మేరకు శ్రీకాకుళం జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. కృష్ణంనాయుడు, కార్యవర్గ సభ్యులు కె.భుజంగరావు, నరసింహులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ తదితరులు విద్యాసాగర్ భౌతికకాయానికి నివాళులర్పించారు. మృతుని తల్లి గోరింట జనార్దనమ్మకు మట్టి ఖర్చుల కింద రూ.25 వేలను అందజేశారు. గురుగుబెల్లి నీలారావు, లక్షణ మాస్టారు, శ్రీకాకుళం టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు దామోదర్, జితేందర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారి లయన్స్‌క్లబ్ 316-ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్ వర్మ అన్నారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2024-2025 సంవత్సరానికి నియమితులైన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు అతిథిగృహంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1917లో లయన్స్‌క్లబ్ ఏర్పడిందని, ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉండి ఉత్తమ క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ముఖ్యఅతిథి పాల్గొన్న శ్రీకాకుళం నగర కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ప్రపంచంలో సేవ పరంగా లయన్స్ క్లబ్‌కు ప్రత్యేకస్థానం ఉందన్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడుగా డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శిగా డాక్టర్ పైడి సింధూర, కోశాధికారిగా జోగి భారతి, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, బరాటం విశ్వేశ్వరరావు, డైరెక్టర్‌గా పొట్నూరు నరేష్, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా ఉర్లాం శివతేజ, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా బరాటం కృష్ణచైతన్య, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఎం.కె.మిశ్రో ఎన్నికయ్యారు. నగర ప్రముఖులు దుప్పల వెంకటరావు, ఎన్ని ధనుంజయరావు, పూడి తిరుపతిరావు పాల్గొన్నారు.

తెలుగు భాషోన్నతికి కృషి

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం సమీస్తున్న తరుణంలో తెలుగు దనానికి పేరొందిన కరుణశ్రీ వంటి సహజ కవులను తలచుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పలువురు వక్తలు అన్నారు. అందరూ తెలుగు భాషా ఉన్నతికి కృషి చేయాలన్నారు. నగరంలోని శాంతినికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక 95వ నెల సాహితీ సమావేశం ఆదివారం జరిగింది. కళాశాల అధినేత, తెరవే గౌరవ సలహాదారు సురింగి మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంధ్యాల శరత్ బాబు ముఖ్యవక్తగా ప్రసంగించారు. పద్య, గద్య రచనలతో అలరించిన జంధ్యాల పాపయ్య శాస్త్రి సాహితీ మూర్తి మత్వాన్ని ఉదాహరణలతో వివరించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషా ఉన్నతికి చేయాల్సిన కృషిపై కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు, కోమలరావు, ఎం.శ్రీనివాసరావు, ఇద్దిపాపయ్య, నిక్కు హరిసత్యన్నారాయణ, ఐ.ఎన్.సి.ప్రసాద్, ముట్నూరు ఉపేంద్రశర్మ, వి.,రాజారావు, పూడి జనార్దనరావు, తంగి ఎర్రమ్మ, లీలారెడ్డి, ఉమాకవి, బి.జగన్నాధరావు, ఎస్. ఈశ్వరరావు మాట్లాడారు. వక్త శరత్‌బాబును సత్కరించారు.